
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 22 । జూన్ । 2025



లాకులకు లీకులు

కిన్నెరసాని రిజర్వాయర్ లాక్‌లకు పదేళ్లుగా మరమ్మతుల చేయకపోవడంతో లీకేజీలు ఏర్పడి నీరు వృథా అవుతోంది.

8లో



బడిలో సెల్‌కు చెల్లు..

ప్రభుత్వ పాఠశాలల తరగతి గదుల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వాడొద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

8లో

గరిష్టం / కనిష్టం
35° / 26°

వాతావరణం

జిల్లాలోని పలుచోట్ల ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం తర్వాత అక్కడక్కడా జల్లులు పడొచ్చు.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రక్తంగా జరిపించారు.

ఈ - టికెట్లపై భక్తులకు అవగాహన



ఈ - టికెట్ల స్వీకరణను పరిశీలిస్తున్న ఈఓ

భద్రాచలం: భక్తుల సమయాన్ని ఆదా చేసేందుకు దర్శనం, ప్రసాదాలు ఇతర సేవలకు గాను రామాలయంలో ఏర్పాటు చేసిన మిషన్లపై ఈఓ ఎల్.రమాదేవి శనివారం భక్తులకు అవగాహన కల్పించారు. తొలుత ఈ మిషన్లకు పూజలు నిర్వహించాక యంత్రాల్లో ఉన్న సదుపాయాలు, ఈ టికెట్లు పొందే విధానం గురించి వివరించారు. భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భక్తులు సైతం ఈ టికెట్లు తీసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ రవీందర్, ఏఈఓ భవాని రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

రూ. 270.92 కోట్ల రైతు భరోసా జమ

- డీఏఓ బాబూరావు వెల్లడి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇప్పటి వరకు 1,70,764 మంది రైతులకు రూ. 270, 92, 33,145 వారి బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా జమ చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి వి.బాబూరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గత యాసంగిలో ఉన్న పట్టాదారుల సంఖ్య 1,78, 545 కాగా, ఈ వానాకాలం సీజన్ నాటికి కొత్తగా 1,023 మంది పట్టాలు పొందారని పేర్కొన్నారు. గత సీజన్‌లో బ్యాంకు వివరాలు సరిగా లేని పట్టాదారులు 832 మంది ఉన్నారని, అసలే నమోదు చేయని వారు 550 మంది ఉన్నారని వివరించారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో 1,80,119 మంది లబ్ధిదారుల వివరాలను వ్యవసాయ విస్తరణాధికారుల ద్వారా సేకరించి పోర్టల్‌లో నమోదు చేశామని, ఈనెల 21 వరకు 1,76,506 మంది రైతుల కోసం రూ. 305,87,04,190 ట్రెజరీకి పంపామని, అందులో ఈనెల 20వరకు 1,63,360 మంది లబ్ధిదారులకు రూ.237,58,19,701 వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయని వివరించారు. శనివారం 14,642 మంది రైతుల ఖాతాల్లో రూ. 51,31,26,190 జమ చేశామని తెలిపారు.

కార్మికచట్టాల రక్షణకు పోరాటం



మాట్లాడుతున్న లక్ష్మయ్య, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజా రవాణా రంగంతో పాటు కార్మిక చట్టాలను కాపాడుకునేలా ప్రజా ఉద్యమాలకు రూపకల్పన జరగాలని అఖిల భారత రోడ్డు రవాణా కార్మికుల సమాఖ్య(ఏఐఆర్‌డబ్ల్యూఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య అన్నారు. ఇందుకు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ అనుబంధం) మహాసభలు వేదిక కావాలని సూచించారు. ఖమ్మంలో శనివారం ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర నాలుగో మహాసభలు ప్రారంభం కాగా, లక్ష్మయ్య మాట్లాడుతూ 2019 మోటారు వాహనాల చట్టం సవరణతో కేంద్ర ప్రభుత్వం రవాణా సంస్థలకు సమాధి కట్టేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వచ్చేల 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో ఆర్టీసీ కార్మిక వర్గం పాల్గొనాలని కోరారు. సభలో ఆయా సంఘాల నాయకులు థామస్‌రెడ్డి, అశ్వద్ధామరెడ్డి, పాటి అప్పారావు, బత్తినేని హనుమంతరావు, వీ.ఎస్.రావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, పి.శ్రీకాంత్, సీహెచ్.సుందరయ్య, ఎంఎస్.రెడ్డి, వి.రాములు పాల్గొన్నారు.

ఆ ఐదింటి సంగతేంటి?



భద్రాచలం పట్టణ వ్యూ

తెగని విలీన గ్రామ 'పంచాయితీ'లు

- ఏళ్లుగా పెండింగ్‌లోనే సమస్య
- ఈ నెల 25న సీఎంలతో ప్రధాని సమావేశం
- అందులోనైనా చర్చించాలని పలువురి విన్నపం

భద్రాచలం: ఏళ్లు గడస్తున్నా విలీన గ్రామపంచాయతీల సమస్య ఓ కొలిక్కి రావడం లేదు. మాటల దశలోనే ఉన్న ఈ డిమాండ్ కనీసం చర్చలు, ప్రతిపాదనలకు సైతం నోచుకోలేదు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా చేసిన ఈ విలీనాన్ని రద్దు చేసి మళ్లీ తెలంగాణలో కలపాలని ఆయా గ్రామాల ప్రజలు చేస్తున్న విన్నపాలు కేంద్ర ప్రభుత్వం వరకు వెళ్లడం లేదు. అయితే ఈ నెల 25న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఒడిశా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ 'ప్రగతి ఏజెండా' పేరుతో నిర్వహించే సమావేశంలో అయినా విలీన పంచాయతీలపై చర్చ జరగాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కూడా ఈ మేరకు డిమాండ్ చేయడం గమనార్హం.

గతంలోనే సీఎంల భేటీలో ప్రస్తావన..

తెలంగాణ, ఏపీ రాష్ట్ర విభజనకు ముందు యటపాక, పురుషోత్తపట్నం, గుండాల, పిచుకలపాడు, కన్నాయిగూడెం పంచాయతీలు భద్రాచలం డివిజన్‌లో అంతర్భాగంగా ఉండేవి. రాష్ట్ర విభజనలో భాగంగా పోలవరం ముంపు పేరుతో ఈ ఐదు పంచాయతీలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారు. దీంతో తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని, తమ గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం పలుమార్లు నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు చేశారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులను, ఎమ్మెల్యేలను, మంత్రులను కలిసి గోడు వినిపించారు. భద్రాచలం పర్యటనకు వచ్చిన గవర్నర్, రాష్ట్రపతికి సైతం వినతిపత్రాలు సమర్పించారు. కాగా దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎం రేవంత్ రెడ్డితో చర్చించారు. గతంలో ఇరు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు సమావేశమైనప్పుడు కూడా ఈ అంశం ప్రాథమికంగా చర్చకు వచ్చింది. దీనిపై పరిశీలించాలని ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులను వారు ఆదేశించినా సమస్య అపరిష్కృతంగానే ఉండిపోయింది.

25న తీర్మానం చేయాలి..

ఈనెల 25న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ నిర్వహించనున్న సమావేశంలో అయినా దీనిపై చర్చించాలని ఆయా గ్రామాల వారు అంటున్నారు. నాలుగు రాష్ట్రాల సీఎంలు పాల్గొనే ఈ సమావేశం రాష్ట్రాల నడుమ సమస్యల ప్రస్తావన, పరిశీలన, పరిష్కారానికి కీలకం కానుందని, ఈ నేపథ్యంలో విలీన పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలిపేలా తీర్మానం చేయాలని అంటున్నారు. ఈ ఐదు పంచాయతీలను తెలంగాణలో కలిపేలా చర్చ జరగాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తదితరులు శుక్రవారం హైదరా బాద్‌లో జరిగిన ఓ సమావేశంలో డిమాండ్ చేసిన విషయం విదితమే.

అభివృద్ధి పనులకు కీలకం..

భద్రాచలంలో అంతర్భాగమైన ఆ ఐదు పంచాయతీలు ఏపీలో కలవడంతో భద్రాచలం అభివృద్ధి కుంటుపడింది. ప్రభుత్వ పథకాల అమలు, ఇతర నిర్మాణాలకు స్థలం కొరత ఏర్పడింది. ప్రధానంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశాలకు కేంద్రంగా ఉండడంతో పాటు ఆధ్యాత్మిక, పర్యాటకరంగాల్లో దేశ వ్యాప్తంగా భద్రాచలానికి పేరుంది. ఈ నేపథ్యంలో ప్రజల, భక్తుల అభిరుచికి తగినట్లుగా అభివృద్ధి చేయాలంటే ఈ ఐదు పంచాయతీలను భద్రాచలం డివిజన్‌లో విలీనం చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి



కేంద్ర స్థాయిలో ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎంపీలు చొరవ చూపితేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. 25న జరిగే భేటీలో ఏపీ, తెలంగాణ సీఎంలు ఆ ఐదు గ్రామాల వారి కోరిక మేరకు చర్చించాలి. ప్రధానమంత్రి సమక్షంలోనే పరిష్కారం చూపాలి. బిల్లు ఆమోదించేలా చర్యలు తీసుకోవాలి.

– కొప్పుల మురళి, భద్రాచలం

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



ఇల్లెందు : వర్షం వస్తుండగా సభావేదిక నుంచి అభివాదం చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి. పక్కన ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే కనకయ్య తదితరులు

- ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తాం
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

గుండాల : గత పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం కంటే తాము ఈ నాలుగేళ్లలోనే వంద శాతం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుచేసి చూపుతామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం ఆయన గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. జగ్గుతండా – లక్ష్మీదేవిపల్లి, చీమల గూడెం – ఇప్పలగుంపు మధ్య బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. తూరుబాకలో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ, మామకన్నులో నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభించారు. ఆళ్లపల్లి మండలంలో కస్తూర్బా పాఠశాల భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. పినపాక నియోజకవర్గానికి మొదటి విడుతగా 4,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ఆ తర్వాత విడతల వారీగా ప్రతి నిరుపేదకూ ఇళ్లు ఇస్తామని భరోసా ఇచ్చారు. ప్రతీ సోమవారం నిధులు విడుదల చేస్తామన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో రూ.17వేల కోట్లు రుణమాఫీ చేస్తే తాము 10 నెలల వ్యవధిలోనే రూ.21వేల కోట్లు మాఫీ చేశామని చెప్పారు. కొత్తగూడెం-ఆళ్లపల్లి మధ్య రోడ్డు నిర్మాణానికి రూ. 100 కోట్లు మంజూరయ్యాయని, వచ్చే నెలలో టెండర్లు పిలుస్తామని హామీ ఇచ్చారు. గుండాల ప్రభుత్వాస్పత్రికి రెండు డయాలసిస్ కేంద్రాలు మంజూరు చేశామని, నెల రోజుల్లో ప్రారంభిస్తామని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్ని అమలు చేస్తామని స్పష్టం చేశారు. కొన్నేళ్లుగా పోడు సాగు చేస్తున్న భూముల జోలికి వెళ్లొద్దని అటవీ అధికారులకు సూచించిన మంత్రి.. కొత్తగా పోడు సాగు చేయొద్దని గిరిజనులను కోరారు. ఈ మేరకు పోలీసులు, అటవీ అధికారులతో సమావేశం నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను ఆదేశించారు. తొలత జగ్గుతండాలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహబూబాబాద్ ఎంపీ బలరామ్ నాయక్ మాట్లాడుతూ.. ఈప్రాంత అభివృద్ధికి తాను గతంలో కూడా నిధులు మంజూరు చేయించానని, భవిష్యత్‌లో కూడా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, అదనపు కలెక్టర్ విద్యాచందన, నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, గాంధీ, ఖదీర్, ముత్యమాచారి, సీపీఐ నాయకులు బొల్లోజు అయోధ్య పాల్గొన్నారు.



గుండాల : ఇందిరమ్మ ఇల్లు మంజూరైన మహిళకు పత్రం అందిస్తున్న పొంగులేటి, పక్కన కలెక్టర్ పాటిల్, పీఓ రాహుల్ తదితరులు

పొంగులేటి సభకు వర్షం అడ్డంకి..

ఇల్లెందు : రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఇల్లెందులోని సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించాల్సిన పార్టీ నాయకులు, కార్యకర్తల సభకు వర్షం అడ్డంకిగా మారింది. మంత్రి పొంగులేటి హాజరు కానుండగా పెద్ద ఎత్తున ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు తరలివచ్చారు. సభ ప్రారంభానికి ముందే ఒక విడత వర్షం కురిసింది. అప్పటికే గ్రౌండ్‌కు చేరుకున్న ప్రజలు చెట్ల కిందకు చేరి వర్షం ఆగిన తర్వాత మళ్లీ సభా ప్రాంగణంలోకి చేరుకున్నారు. గంట ఆలస్యంగా ప్రారంభమైన సభలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రసంగిస్తుండగా మరోసారి వర్షం కురిసింది. దీంతో జనం అంతా పరుగులు తీస్తూ ఇంటి దారి పట్టారు. కొంతమంది వర్షంలోనూ తడుస్తూ అక్కడే వేచి ఉండగా సభా వేదిక వద్దకు చేరుకున్న పొంగులేటి వారికి అభివాదం చేసి, మాట్లాడకుండానే వెళ్లిపోయారు. మంత్రి వెంట ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఎంపీ పోరిక బలరాం నాయక్, కాంగ్రెస్ నేతలు డానియేల్, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సయ్యద్ జానీపాషా, మండల రాము, మడుగు సాంబమూర్తి, బానోతు సుజాత, చిల్లా శ్రీనివాస్, పడిదల నవీన్, అంకెపాక నవీన్ తదితరులు ఉన్నారు.

తీరు మారడం లేదు !

- ఏసీబీకి చిక్కుతున్న ప్రభుత్వ ఉద్యోగులు
- లంచం తీసుకుంటూ పట్టుబడిన టైపిస్ట్
- బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఘటన



ఏసీబీకి పట్టుబడిన టైపిస్ట్ నవక్రాంత్

బూర్గంపాడు: జిల్లాలోని పలువురు ప్రభుత్వ ఉద్యోగులు లంచం తీసుకుంటూ తరచూ ఏసీబీకి పట్టుబడుతున్నారు. ఓ ఘటన మరువక ముందే మరో ఘటన అన్నట్లుగా దొరికిపోతున్నారు. పట్టుబడిన వారిపై వేటు వేస్తున్నా.. మిగితా ఉద్యోగుల వైఖరిలో మార్పు రావడం లేదు. ఇటీవల భద్రాచలం, మణుగూరులో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు సీఐలు, సిబ్బంది లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. నాలుగు నెలల క్రితం ఆళ్లపల్లి మండల పంచాయతీ అధికారి కూడా ఏసీబీకి చిక్కాడు. జిల్లాలో వరుసగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా.. లంచాలకు అలవాటుపడిన కొందరు ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం ఇవేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. లంచం అడిగితే తమకు సమాచారం ఇవ్వాలని అవినీతి నిరోధక శాఖ విస్తృతంగా ప్రచారం చేస్తుండడంతో ప్రజల్లో చైతన్యం పెరిగింది. లంచం అడిగిన వారి సమాచారాన్ని నేరుగా ఏసీబీకి చేరవేస్తుండగా ఆ శాఖ అధికారులు పథకం ప్రకారం దాడులు చేస్తూ అవినీతికి పాల్పడుతున్న ఉద్యోగులను అరెస్ట్ చేస్తున్నారు.

రూ.4వేలు తీసుకుంటూ..

బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో టైపిస్ట్‌గా పనిచేసే నవక్రాంత్ కొత్త రేషన్ కార్డు జారీ కోసం ఓ వ్యక్తి నుంచి రూ.4 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు సదరు వ్యక్తి శనివారం నవక్రాంత్‌కు లంచం ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ దాడిచేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నవక్రాంత్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. అతడిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులెవరైనా లంచం డిమాండ్ చేస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు.

ఆరేళ్లలో మూడోసారి..

బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో గత ఆరేళ్లలో ఇప్పటికి మూడుసార్లు ఏసీబీ దాడులు జరిగాయి. పట్టాదారు పాసు పుస్తకాల కోసం రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఇన్‌చార్జ్ తహసీల్దార్(డిప్యూటీ తహసీల్దార్), టైపిస్ట్ గతంలో ఏసీబీకి దొరికిపోయారు. ఆ ఘటన జరిగిన ఏడాదిన్నర తర్వాత ఇసుక కూపన్లకు లంచం తీసుకుంటూ మరో డిప్యూటీ తహసీల్దార్ ఏసీబీకి పట్టుబడ్డాడు. మరోసారి ఏసీబీ దాడులు నిర్వహించేందుకు సమయాత్తమవుతున్న తరుణంలో లంచం అడిగిన అధికారి ఒకరు తెలివిగా విధులకు డుమ్మా కొట్టి తప్పించుకోగలిగాడు. వరుసగా ఈ కార్యాలయంలోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ఉద్యోగులు ఏ మాత్రం భయం లేకుండా లంచం డిమాండ్ చేయడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆరేళ్ల వ్యవధిలో మూడుసార్లు తహసీల్ కార్యాలయ ఉద్యోగులు ఏసీబీకి పట్టుబడడం మండలంలో చర్చనీయాంశమైంది. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. అయినా అధికారులు, ఉద్యోగులు మాత్రం తమ ప్రవర్తన మార్చుకోవడం లేదు.

వీడియో తీసిన రైతు..

అశ్వాపురం మండలంలో ఓ రైతు తన అవసరాల నిమిత్తం పొలం అమ్మగా కొనుగోలు చేసిన వ్యక్తి పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు తహసీల్దార్ రూ.15 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో రూ.5వేలు ఇస్తానని ఒప్పుకున్న రైతు.. తహసీల్దార్‌కు లంచం ఇస్తూ తన సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ శనివారం సదరు తహసీల్దార్‌పై బదిలీ వేటు వేశారు.

వెల్లువలా వినతులు

- జిల్లాలో 529 భూ భారతి సదస్సులు..
- 58,345 దరఖాస్తులు




సుజాతనగర్ మండలం లక్ష్మీదేవిపల్లి సదస్సులో దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్(ఫైల్)

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో నిర్వహించిన భూ భారతి అవగాహనా సదస్సుల్లో వివిధ సమస్యలపై దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లా వ్యాప్తంగా 529 సదస్సులు జరగగా.. 58,345 వినతులు వచ్చాయి. కొత్తగూడెం రెవెన్యూ డివిజన్ పరిధిలోని సుజాతనగర్ మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా, ఇక్కడ నిర్వహించిన సదస్సుల్లో 649 మంది పలు రకాల భూ సమస్యలపై వినతులు సమర్పించారు. ఈ డివిజన్‌లో మొత్తం 15 మండలాలు ఉండగా మిగిలిన 14 మండలాల్లో 45,698 దరఖాస్తులు వచ్చాయి. భద్రాచలం డివిజన్‌లోని 8 మండలాల్లో 207 సదస్సులు జరగగా 12,657 దరఖాస్తులు వచ్చాయి. కొత్తగూడెం ఆర్డీఓ మధు, భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు ఆయా డివిజన్లలో సదస్సులను పర్యవేక్షించారు. పలుచోట్ల కలెక్టర్ జితేష్ వి పాటిల్ హాజరై భూ భారతి సదస్సుల ప్రాధాన్యతను రైతులకు వివరించారు. ప్రధానంగా సాదాబైనామా, అసైన్‌మెంట్ భూముల రిజిస్ట్రేషన్, భూముల సర్వే సరిహద్దుల సమస్యలపై ఎక్కువగా దరఖాస్తులు అందాయని, వీటిపై సమగ్ర విచారణ చేస్తామని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- ప్రతిరోజూ అలవాటుగా మార్చుకోవాలి
- ఎస్పీ రోహిత్‌రాజు



యోగా చేస్తున్న ఎస్పీ తదితరులు



యోగాసనాలు వేస్తున్న పీఓ రాహుల్, ఎమ్మెల్యే వెంకట్రావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నిత్యం యోగా చేయడంతో పని ఒత్తిడి నుంచి ఉపశమనంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనందమైన జీవితానికి ప్రతి ఒక్కరూ రోజూ యోగా చేయాలని సూచించారు. ప్రపంచదేశాలు యోగా ప్రాముఖ్యతను తెలుసుకుని ప్రత్యేక గుర్తింపు ఇచ్చాయని అన్నారు. పనిపై శ్రద్ధ పెరగడానికి, మానసిక ప్రశాంతతకు యోగా ఉపయోగపడుతుందని చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందితో యోగాసనాలు, ధ్యానం, శ్వాసపై ధ్యాస, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం తదితర ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేందర్, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, డీసీఆర్‌బీ, ఏఆర్ డీఎస్పీలు మల్లయ్యస్వామి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భారతీయుల అమూల్య సంపద..

భద్రాచలం : యోగా భారతీయుల అమూల్య సంపద అని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ ట్రైబల్ మ్యూజియంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన ఘనత భారతీయులదని, అది నేడు అందరికీ అనుసరణీయంగా మారిందని అన్నారు. యోగాసనాలతో మానసిక ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. విద్యార్థులతో నిత్యం యోగా చేయించాలని గిరిజన సంక్షేమ పాఠశాలల హెచ్‌ఎంలు, వార్డెన్లు, ఉపాధ్యాయులను ఆదేశించారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. యోగా శారీరక వ్యాయామం మాత్రమే కాదని, దీంతో ఆరోగ్య, ఆధ్యాత్మిక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. యోగా గురువు గుమలాపురం సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు నిత్యం యోగా చేస్తే మేధాశక్తి నైపుణ్యాలు పెరుగుతాయని సూచించారు. కార్యక్రమంలో ఏఓ సున్నం రాంబాబు, ఎస్ఓ భాస్కరన్, ఏటీడీఓ అశోక్ కుమార్, క్రీడాధికారి గోపాలరావు, జీసీడీఓ అలివేలు మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంస్కృత పండితుడికి సన్మానం



శ్రీమన్నారాయణ ఆచార్యులును సన్మానిస్తున్న ఆలయ అధికారులు

భద్రాచలంటౌన్: భద్రాచల దేవస్థానంలో సంస్కృత పండితుడిగా పనిచేస్తున్న ఎస్‌టీజీ శ్రీమన్నారాయణ ఆచార్యులును భద్రాద్రి దేవస్థానం, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చిత్రకూట మండపంలో శనివారం ఘనంగా సన్మానించారు. వేలాది మంది విద్యార్థులకు సంస్కృత భాషను బోధించిన ఆయన ఇటీవల ప్రాచ్య విద్య విభూషణం బిరుదు అందుకున్నారు. ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎల్. రమాదేవి, ఏఈఓలు శ్రవణ్ కుమార్, భవాని రామకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప కాలనీలో నివాసాల కూల్చివేత

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అయ్యప్ప కాలనీలో ఉన్న 40 నివాసాలను శనివారం గ్రామ పంచాయతీ అధికారులు జేసీబీ యంత్రాలతో కూల్చివేశారు. ఈ ఇళ్లలో ఉండే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్‌లో డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించిందని గ్రామ పంచాయతీ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రాంతంలో కలెక్టర్ ఆదేశాల ప్రకారం జామాయిల్ మొక్కలను నాటి, సంరక్షిస్తామని పేర్కొన్నారు. కాగా ఇప్పటికే అశోక్‌నగర్ కొత్తకాలనీలో గత నెలలో 41 నివాసాలను సంబంధిత అధికారులు కూల్చివేశారు.

భూ వివాదంలో ఘర్షణ

దుమ్ముగూడెం: మండల పరిధిలోని గోవిందాపురం గ్రామానికి చెందిన సవలం మల్లేష్, సవలం నాగేశ్వరరావు భూ వివాదం నేపథ్యంలో శనివారం రాత్రి గొడవ పడ్డారు. ఈ క్రమంలో నాగేశ్వరరావు కత్తితో దాడి చేయడంతో మల్లేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో భద్రాచలం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నిందితుడు నాగేశ్వరరావు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోగా, ఘటన స్థలాన్ని దుమ్ముగూడెం సీఐ అశోక్ పరిశీలించారు.

విద్యార్థులపై శ్రద్ధ చూపాలి

- భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్



ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రాహుల్

పాల్వంచరూరల్: విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, పోస్ట్‌మెట్రిక్, ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో సోమవారం నాటికి వందశాతం హాజరు ఉండాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదేశించారు. పాల్వంచలోని గిరిజన బాలికల పోస్టు మెట్రిక్ వసతి గృహాన్ని, బాలుర ఆశ్రమ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. హాస్టల్ గదులు, డార్మెటరీ, డైనింగ్ హాల్, బాత్‌రూమ్‌లు, వంటగదులు, వసతి గృహాల పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది, విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలకు చేరుకునేలా హెచ్‌ఎంలు, వార్డెన్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, డ్రెయినేజీలు, బాత్‌రూమ్‌లు శుభ్రంగా ఉంచాలని, పిల్లలకు రక్షిత తాగునీరు అందించాలని చెప్పారు. నూతన మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఆదేశించారు. హాస్టళ్లలో మరమ్మతులు ఉంటే ప్రతిపాదనలు రూపొందించాలని చెప్పారు. వేసవి సెలవుల అనంతరం హాస్టళ్లకు వచ్చిన విద్యార్థులు ప్రస్తుత వాతావరణం మార్పుతో అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, వార్డెన్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. హెచ్‌ఎంభద్రు, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.62 కోట్లు కొల్లగొట్టిన కేసులో ఇంకొకరి అరెస్టు

ఖమ్మం క్రైం: ఆన్‌లైన్ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించి సుమారు రూ.1.62 కోట్ల మేర మోసం చేసిన కేసులో మరో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. బోనకల్ మండలానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు ఫోన్ చేసిన ముఠా సభ్యులు దితులు అధిక లాభాలు వస్తాయని ఆశ చూపి వాట్సప్, ట్రేడింగ్ లింక్‌ల ద్వారా సుమారు రూ.1.62 కోట్లు జమ చేయించారు. ఆతర్వాత ముఖం చాటేయడంతో మోసపోయిన గుర్తించిన బాధితుడు ఖమ్మం సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. దీంతో డబ్బు జమ అయిన అకౌంట్ ఆధారంగా ఇప్పటికే నలుగురిని అరెస్ట్ చేయగా, నేనావత్ అఖిల్‌ను నాగర్‌కర్నూల్ జిల్లాలో అరెస్టు చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరుపర్చాక రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. కేసు విచారణలో కీలకంగా వ్యవహరించిన సైబర్ క్రైం డీఎస్పీ ఫణీందర్, ఎస్సైలు రంజిత్‌కుమార్, విజయ్‌కుమార్, సిబ్బందిని సీపీ అభినందించారు.

లాకులకు లీకులు..



కిన్నెరసాని జలాశయం నుంచి వృథాగా పోతున్న నీళ్లు

కిన్నెరసాని ప్రాజెక్ట్‌కు పొంచి ఉన్న ముప్పు

- పదేళ్లుగా మరమ్మతులకు నోచుకోని గేట్లు
- నిధులున్నా టెండర్లకు ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు
- ప్రమాదమేమీ లేదని కొట్టిపారేస్తున్న జెన్‌కో అధికారులు



మొదటి గేట్ వద్ద లీకేజీతో బయటకు వస్తున్న నీరు

పాల్వంచరూరల్: పారిశ్రామిక నీటి అవసరాలు తీర్చడంతోపాటు తాగు, సాగునీరు అందించే కిన్నెరసాని ప్రాజెక్ట్‌కు ప్రమాదం పొంచిఉంది. పదేళ్లుగా ప్రాజెక్ట్ గేట్లు(లాకులు) మరమ్మతులకు నోచుకోవడంలేదు. దీంతో గేట్ల మధ్య లీకులు ఏర్పడి జలాశయం నుంచి నీరు వృథాగా పోతోంది. రెండు, మూడేళ్లుగా గేట్ల రబ్బర్ సీల్స్ లీకై నీళ్లు బయటకు వస్తున్నాయి. లీకేజీ చిన్న సమస్యగా భావించి నిర్లక్ష్యం వహిస్తే పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని ఆయకట్టు రైతులు, పరీవాహక ప్రాంతాల ప్రజలు పేర్కొంటున్నారు. గేట్లకు సంబంధించిన పిల్లర్లు కూడా దెబ్బతింటున్నాయి. మరమ్మతులకు అవసరమైన నిధులున్నా పనులు చేపట్టడంలేదు. ప్రాజెక్ట్ నిర్వహణ చూస్తున్న జెన్‌కో (కేటీపీఎస్) అధికారులు మేల్కొనకపోతే పరిస్థితి తారుమారయ్యే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

రిజర్వాయర్ సామర్థ్యం 407 అడుగులు

కిన్నెరసాని రిజర్వాయర్ నిర్మాణం 1962లో ప్రారంభించి 1972లో పూర్తిచేశారు. 13క్రస్ట్‌గేట్లతో 407 అడుగుల గరిష్ఠ నీటిమట్టంతో 8.4 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో జలాశయం నిర్మించారు. తొలుత ప్రాజెక్ట్‌ను ఇరిగేషన్ శాఖ పర్యవేక్షించగా, 1998 ఏప్రిల్ 1 నుంచి జెన్‌కో పర్యవేక్షిస్తోంది. ప్రాజెక్ట్ నిర్మించి ఆరు దశాబ్దాలు గడుస్తుండగా మధ్యలో జెన్‌కో అధికారులు కరకట్టను పటిష్టపరిచే పనులు చేపట్టారు. 2014లో రూ.60 లక్షలతో 13 క్రస్ట్ గేట్లకు రోప్ వే, సాకెట్లను మార్చారు. దీంతో వీటిని మరో పదేళ్ల మార్చాల్సిన అవసరం లేదు. కాగా కిన్నెరసాని జలాశయం విస్తీర్ణం 515 చదరపు మీటర్లు, డ్యామ్ ఎత్తు 39మీటర్లు, పొడవు 2.4 కిలోమీటర్లుగా ఉంది. కేటీపీఎస్‌లో విద్యుదుత్పత్తికి, ఎన్‌ఎండీసీ, నవభారత్, కర్మాగారాలకు కిన్నెరసాని నుంచే నీరు సరఫరా చేస్తున్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌కు తాగునీరు, పాల్వంచ మండలంలో మూడు వేలు, బూర్గంపాడు మండలంలో 7 వేల ఎకరాలకు సాగు నీరు కూడా అందిస్తున్నారు.

కట్ట పటిష్టతకు రూ.1.90 కోట్లు

కిన్నెరసాని జలాశయం కరకట్ట పటిష్టతకు జెన్‌కో యాజమాన్యం రూ.1.90 కోట్లు, గేట్ల మరమ్మతులకు రూ.1.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. అయితే పుణేలోని సెంట్రల్ వాటర్ పవర్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీడబ్ల్యూపీఆర్‌ఎస్) నుంచి నిపుణులు వచ్చి అధ్యయనం చేయాల్సి ఉంది. ప్రాజెక్ట్‌ను పరిశీలించి సమగ్ర నివేదికను సమర్పించిన తర్వాత పనులు చేపడతామని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితులతోపాటు భవిష్యత్‌లో ఎదురయ్యే పరిణామాలను తట్టుకునేలా నిపుణులు అధ్యయనం చేసి సలహాలు ఇస్తారని పేర్కొన్నారు. ఇక గేట్ల మరమ్మతులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఆసక్తి చూపకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది.

మూడుసార్లు టెండర్లు పిలిచాం..



కిన్నెరసాని గేట్ల మరమ్మతుల కోసం రూ.1.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గత నెల 6న, 22న, ఈ నెల 3న... మూడు సార్లు టెండర్లు పిలిచాం. కానీ కాంట్రాక్టర్లు ఎవరూ ముందురావడంలేదు. డ్యామ్‌లో నీటిమట్టం 393 అడుగులు ఉంటేనే మరమ్మతులు చేసే అవకాశంఉంటుంది. గేట్ల మధ్య సీల్స్ ఏర్పాటు, రోప్ మార్పు, పెయింటింగ్ పనులు నిర్వహిస్తాం. డ్యామ్ సేఫ్టీ కోసం కూడా ప్రత్యేక నిధులు మంజూరయ్యాయి.

–ప్రభాకర్‌రావు, కేటీపీఎస్ 5వ దశ సీఈ

పదేళ్ల క్రితం మరమ్మతులు

గేట్లకు పదేళ్ల క్రితం మరమ్మతులు నిర్వహించారు. నాలుగైదు ఏళ్లకోసారి మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా జెన్‌కో అధికారులు పట్టించుకోవడం లేదు. రిజర్వాయర్‌లోని నీటిమట్టం 393 అడుగుల లోపు ఉంటేనే పనులు చేపట్టేందుకు వీలవుతుంది. అంతకంటే ఎక్కువగా పెరిగితే పనులు సాధ్యం కావని అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్ట్ ఒకటో గేటు నుంచి నాలుగో గేటు వరకు, 13వ నంబర్ గేటు మధ్య పిల్లర్లకు బీటలు వారాయి. దీంతో పిల్లర్ల మధ్య నీటి చెమ్మ అధికంగా కన్పిస్తోంది. గేట్ల మధ్య రబ్బర్ సీల్స్ కూడా లీకవుతుండటంతో రిజర్వాయర్ నుంచి నీరు వృథాగా పోతోంది. అయితే ఈ లీకులతో ప్రమాదమేమీ లేదని కేటీపీఎస్ అధికారులు చెబుతున్నా రు. రిజర్వాయర్‌లో నీటిమట్టం 400 అడుగులకు మించి పెరిగినప్పుడే బీటలనుంచి నీళ్లు బయటకు వస్తాయని పేర్కొంటున్నారు. పరీవాహక గ్రామాల ప్రజ లు, ఆయకట్టు రైతులు మాత్రం ఆందోళన చెందుతున్నారు. ఆదిలోనే మరమ్మతులు నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని ఆవేదన చెందుతున్నారు. కాగా పిల్లర్ల మరమ్మతులు, ఇతర పనుల కోసం ఏడేళ్ల క్రితం కేంద్ర ప్రభు త్వ పథకం డ్రిప్ ఇరిగేషన్ కింద రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపారు. కానీ నిధులు మంజూరు కాలేదు.



దెబ్బతిన్న పిల్లర్

బడిలో సెల్‌కు చెల్లు



- తరగతి గదుల్లో ఉపాధ్యాయులు ఫోన్ మాట్లాడొద్దు
- స్పష్టమైన ఆదేశాలు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- పిల్లల చదువుపై ప్రభావం పడుతుందని నిర్ణయం

వైరా: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఇకపై తరగతి గదిలో సెల్‌ఫోన్ మాట్లాడడం నిషేధం. ఈ విషయమై రాష్ట్రప్రభుత్వం కొద్దిరోజుల క్రితం స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. తరగతి గదిలో ఉన్న సమయాన సెల్‌ఫోన్‌లో మాట్లాడితే చర్యలు ఉంటాయని అందులో వెల్లడించింది. రాష్ట్రంలో చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లు వినియోగిస్తున్నారనే సమాచారంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఉపాధ్యాయులు తరగతి గదుల్లో ఫోన్లు మాట్లాడడం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా పిల్లల చదువుపై ప్రభావం పడుతుందని నిపుణుల సూచనలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు ఉపాధ్యాయులు స్వీయ నియంత్రణ పాటిస్తూ సెల్‌ఫోన్ వినియోగాన్ని పరిమితం చేసుకోవాలని సూచించింది.

విలువైన సమయం వృథా కాకుండా..

తరగతి గదుల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ మాట్లాడడం ద్వారా సమయం వృథా అవుతుందని, విద్యార్థుల్లో ఏకాగ్రత దెబ్బతింటుందని చెబుతున్నారు. అంతేకాక ఫోన్‌లో మాట్లాడగానే అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు వెంటనే పాఠ్యాంశంలో నిమగ్నం కావడం సాధ్యం కాదనే భావన వ్యక్తమవుతోంది. ఈ విషయమై విద్యావేత్తల నుంచి అందిన సమాచారంతో ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్లు తెలుస్తోంది. కాగా, ఉపాధ్యాయులు తరగతి గదిలోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లకుండా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకో వాలి. రాగానే స్టాఫ్‌రూమ్‌లో పెట్టడం.. విరామ సమయాల్లోనూ చూసేలా పర్యవేక్షించాల్సి ఉంటుంది.

కఠిన చర్యలు తీసుకుంటాం..



ఉపాధ్యాయులు తరగతి గదుల్లో సెల్‌ఫోన్లు తీసుకెళ్లొద్దు. ఎవరైనా పాఠం మధ్యలో ఫోన్ మాట్లాడినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. పాఠశాలకు సెల్‌ఫోన్ తీసుకొచ్చినా హెచ్‌ఎంకు అప్పగించాలి. అలా కాకుండా మధ్యలో వినియోగిస్తే బోధనపై ఏకాగ్రత దెబ్బతింటుంది.

– సామినేని సత్యనారాయణ, ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారి

ప్రభుత్వ నిర్ణయం మంచిదే..



ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు పనివేళల్లో సెల్‌ఫోన్ వాడకుండా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదే. తద్వారా విద్యార్థులు, బోధనకు పూర్తి సమయాన్ని కేటాయించినట్లు అవుతుంది. విద్యార్థులకు న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకోవడం హర్షణీయం.

– డి.వరప్రసాద్, ఎస్‌టీయూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు

నాటు సారా స్వాధీనం

కొత్తగూడెంఅర్బన్: రామవరం ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టిన ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు నాలుగు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకుని, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు టాస్క్ ఫోర్స్ ఎస్ఐ గౌతమ్ తెలిపారు.

37 కేజీల గంజాయి సీజ్

ఇద్దరు మహిళలు సహా ముగ్గురు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పాల్వంచరూరల్: గంజాయి తరలిస్తున్న ఇద్దరు మహిళలతోపాటు ఓ వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని సీతానాగారం కాలనీ వద్ద రూరల్ ఎస్ఐ సురేష్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో భద్రాచలం నుంచి పాల్వంచ వైపు వస్తున్న కారు పోలీసులను గమనించి కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వైపు మళ్లింది. దీంతో పోలీసులు వెంబడించి కారును పట్టుకుని తనిఖీ చేశారు. వాహనంలో రూ.18.82 లక్షల విలువైన 37.650 కేజీల గంజాయి లభించింది. గంజాయిని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వరంగల్ జిల్లా గీసుకొండ మండలం సింగ్యాతండాకు చెందిన బానోతు వెంకన్న, బానోతు కల్పన, నర్సంపేట మండలం రాంనాయక్ తండాకు చెందిన గుగులోతు పార్వతిలను అరెస్ట్ చేశారు. విచారించగా ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు తేలింది. గంజాయి తరలింపునకు ఎస్కార్ట్‌గా ఉన్న ఒడిశాకు చెందిన రమేష్, రాము, బెంగళూరుకు చెందిన రాజేష్, ఏపీ రాష్ట్రంలోని తాడిపత్రికి చెందిన జవహర్‌లు పరారీలో ఉన్నారు. మొత్తం ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

కారు పల్టీ: కమిషనర్‌కు తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇల్లెందు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ రోడ్డు ప్రమాధంలో గాయపడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి ఇల్లెందు నుంచి కొత్తగూడెం వెళ్తున్న ఆయన కారు టేకులపల్లి మండలం బోరింగు తండా వద్ద పల్టీ కొట్టింది. దీంతో కమిషనర్‌కు తీవ్రగాయాలయ్యా యి. అటుగా వెళ్తున్న వారు గమనించి సమాచారం ఇవ్వటంతో ఆయన్ను కుటుంబ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది ఖమ్మం తరలించారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న కమిషనర్‌ను మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్ తదితరులు పరామర్శించారు. కాగా కమిషనర్ శ్రీకాంత్ ఆరు నెలల కాలంలో రెండోసారి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు.

అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్: కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డా డు. మండలంలోని కాకర్లపల్లికి చెందిన మట్టా మురళీకృష్ణ(45) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నాక ఫలితం లేక శుక్రవారం రాత్రి ఆయన పురుగుల మందు తాగగా ప్రభుత్వాస్పత్రి తరలించా రు. అక్కడే చికిత్సపొందుతూ మృతిచెందాడు. మురళీకృష్ణకు భార్య, ఇద్దరు కుమారులు ఉండగా, శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థినులకు గాయాలు

కొత్తగూడెంఅర్బన్: ఆటో బోల్తా పడి ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థినులు గాయపడ్డ ఘటన శుక్రవారం జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థినులు ప్రయాణిస్తున్న ఆటో కేఎస్‌ఎం దగ్గర అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో ఓ విద్యార్థిని కాలు విరిగింది. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను కొత్తగూడెంలోని సర్వజన ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై కళాశాల ప్రిన్సిపాల్‌ను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. వారు స్పందించలేదు.

తిమ్మంపేట శివారులో క్షుద్ర పూజలు



క్షుద్ర పూజల ఆనవాళ్లు

ములకలపల్లి: మండల పరిధిలోని తిమ్మంపేట శివారులో క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామ శివారులో బీటీ రోడ్డుపై పూజలు చేసిన గుర్తులు కనిపిస్తున్నాయి. పసుపు, కుంకుమలతో మానవ ఆకారంలో బొమ్మ గీశారు. శుక్రవారం అర్ధరాత్రి పూజలు చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వ్యక్తిని కట్టేసి హత్యాయత్నం

ఇల్లెందురూరల్: భార్య, అత్తగారింటి సభ్యులు తనను కట్టేసి హత్య చేయబోయారని ఆరోపిస్తూ భర్త రామకృష్ణ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన రామకృష్ణకు ఇల్లెందులోని స్టేషన్‌బస్తీకి చెందిన రాజేశ్వరితో 13 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో విడివిడిగా ఉంటున్నారు. ఈ క్రమంలో భార్య రాజేశ్వరి, అత్త ఆళ్లకట్టి సరిత, మామ సారయ్య, బావమరిది ప్రేమ్‌సాయి కలిసి మాట్లాడుదామని ముకుందాపురంలో ఉంటున్న రామకృష్ణను నిజాంపేటలో అతను అద్దెకు తీసుకున్న ఇంటికి పిలిపించారు. మాటమాట పెరిగి ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో రామకృష్ణను ఇంట్లో సిమెంట్ పోలుకు కట్టేసి పెట్రోల్ చల్లుతుండగా, అదే సమయంలో అక్కడికి వచ్చిన అతని మేనమామ బండారు శ్రీనివాస్ రక్షించి ఆస్పత్రిలో చేర్పించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు.

అక్రమ ఇసుక నిల్వలు సీజ్



రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుక

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం కరకట్ట తదితర ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను శనివారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. సుమారు 40 ట్రక్కుల ఇసుక నిల్వలను గుర్తించి సీజ్ చేశామని తహసీల్దార్ అశోక్‌కుమార్ తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఎదురెదురుగా బస్సు, ఆటో ఢీ

ఇద్దరు మహిళల మృతి, మరో ఇద్దరి పరిస్థితి విషమం



ఘటనాస్థలంలో క్షతగాత్రులు

కామేపల్లి: కామేపల్లి మండలం ముచ్చర్ల క్రాస్ సమీపాన శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలు... మహబూబాబాద్ జిల్లా గార్ల నుంచి లింగాల మీదుగా ఖమ్మం వైపు ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ఖమ్మం నుంచి నలుగురు ప్రయాణికులతో ఇల్లెందు వైపు వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ సలీంతో ఆటోలో ప్రయాణిస్తున్న షేక్ మహబూబ్, హలీమా, సోందుబీ, జర్పుల కమలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఎస్సై సాయికుమార్, సిబ్బందితో చేరుకుని క్షతగాత్రులను 108లో ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలోనే కొణిజర్ల మండలం గుబ్బగుర్తికి చెందిన షేక్ సోందుబీ(68) మృతి చెందింది. అలాగే చికిత్స చేయిస్తుండగా గాదెపాడుకు చెందిన అంగన్‌వాడీ టీచర్ షేక్ మహబూబ్(48) కన్నుమూసింది. అంతేకాక అలాగే, సలీం(ఇల్లెందు) పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, కమల(గాదెపాడు)కు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు.

విత్తన వ్యాపారికి షోకాజ్ నోటీస్

సుజాతనగర్: అనుమతులు లేని చోట విత్తనాలు విక్రయిస్తూ పట్టుబడిన సుజాతనగర్‌కు చెందిన విత్తన వ్యాపారికి జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు ఏఓ జి.నర్మద శనివారం తెలిపారు. విత్తన వ్యాపారి శివనాయక్ నిబంధనలకు విరుద్ధంగా చంద్రుగొండ మండలంలో విత్తనాలు విక్రయిస్తూ పట్టుబడటంతో కేసు నమోదైందని, దీంతో షోకాజ్ నోటీసు అందజేసినట్లు పేర్కొన్నారు.